సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం, 30, ఏప్రిల్, 2024



ప్రతిభను వెలికితీసేందుకే..

గిరిజన సంక్షేమ శాఖ కళాశాలల్లో బోధిస్తున్న లెక్చరర్ల ప్రతిభను వెలికితీసేందుకే టెస్ట్‌లు పెడుతున్నామని పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు.

8లో



ఇక్కడ మరింత భద్రత..

ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని 230 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

8లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టంగా నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

ఖమ్మం.. బ్రహ్మరథం పట్టింది

- నాటి దీక్షకు ప్రజలు మద్దతు పలికారు..
- జిల్లాను సస్యశ్యామలం చేసేందుకే 'సీతారామ'
- ఖమ్మం, కొత్తగూడెంకు రెండు మెడికల్ కాలేజీలు
- ఇప్పుడు ఖమ్మంలో మూడురోజులకోసారి తాగునీరు
- ఈ ఎన్నికల్లో జిల్లా ప్రజలు ఆలోచన చేయాలి
- బీఆర్‌ఎస్‌కు శక్తి, బలం ఇచ్చేలా నామను గెలిపించాలి
- బస్సుయాత్రలో గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్



ఖమ్మం లో నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'నాకు బాగా గుర్తుంది.. నేను ఒక్కడిని బయలుదేరిన నాడు తెలంగాణ వస్తదని ఎవరికీ నమ్మకం లేదు. నేను ఆమరణ దీక్షకు పూనుకుంటే నన్ను అరెస్ట్ చేసి ఖమ్మం జిల్లా జైలుకు తీసుకొచ్చారు. ఇక్కడ జిల్లా జైలులోనే పెడితే ఆనాడు జిల్లా బిడ్డలు, న్యూడెమోక్రసీ, కమ్యూనిస్టు విద్యార్థి బృందాలు, తెలంగాణ వాదులు బ్రహ్మరథం పట్టి ఆశీర్వదించి నాకు మద్దతు పలికారు. ఆ సంఘటన నేను మర్చిపోలేను' అని గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ దీక్షాస్మృతులను గుర్తు చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున ప్రచారానికి కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర వరంగల్ జిల్లా నుంచి తిరుమలాయపాలెం మీదుగా సోమవారం రాత్రి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. దారి పొడవునా ప్రజలు ఘనస్వాగతం పలకగా, ఖమ్మం కాల్వొడ్డు నుంచి మయూరిసెంటర్, వైరారోడ్ మీదుగా జెడ్పీ సెంటర్ వరకు గంట పాటు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా జెడ్పీ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

కాంగ్రెస్ మెడలు వంచాలి..

రాష్ట్రంలో రైతులను ఎలా ఆదుకోవాలన్నది ప్రముఖ ఆగ్రో ఎకానమిస్ట్ అశోక్ గులాటీతో నెలల పాటు చర్చించి కార్యక్రమాలు తీసుకున్నాం. రైతుబంధు అందరికీ ఇచ్చాం. నీటి తీరువా రద్దు చేశాం. 7,500 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేశాం. కానీ ఇప్పుడు ఐదు ఎకరాలు ఉంటేనే రైతుబంధు ఇస్తామని కాంగ్రెస్ అంటోంది. ఆరు ఎకరాలు, ఏడు ఎకరాలు ఉన్న రైతులు కోటీశ్వరులా? 25 ఎకరాల తర్వాత ఇవ్వనంటే ఒక అర్థం ఉంటుంది. ఇదెక్కడి న్యాయం .. కాంగ్రెస్ మెడలు వంచాలి. పాత పద్ధతిలో అన్నీ జరగాలంటే బీఆర్‌ఎస్‌కు బలం ఇవ్వాలి. ఖమ్మం జిల్లా అంటే చైతన్యవంతమైన జిల్లా. అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో జరిగింది. ఈ ఎన్నికల్లో జిల్లా ప్రజలు ఆలోచించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలి.

ట్యాంకర్లు కొనే పరిస్థితి ఇప్పుడు

పువ్వాడ అజయ్ నాయకత్వంలో ఖమ్మంలో లకారం చెరువు, మంచినీటి వ్యవస్థ మంచిగా జరిగింది. ఖమ్మం పట్టణంలో రోజూ మంచినీళ్లు వచ్చేవి. కానీ ఇప్పుడు మూడు రోజులకోసారి మంచినీళ్లు వస్తున్నాయి. వాటర్‌ట్యాంకర్లు కొనే పరిస్థితి వచ్చింది. నాలుగు నెలల్లోనే ఇవన్నీ మాయమైపోతాయా? నేలకొండపల్లిలో పంటలు ఎండిపోతున్నాయని రైతులు పాలేరు తూములు ఎత్తుతుంటే పక్క జిల్లాలో ఉన్న నీటి మంత్రి, ఈ జిల్లా వ్యవసాయ శాఖ మంత్రి ఏం చేసిండ్రు.. బీఆర్‌ఎస్ హయాంలోనే ఖమ్మం, కొత్తగూడెంకు మెడికల్ కాలేజీలు ఇచ్చినం . బీజేపీ కేంద్రమంత్రి, ఆ పార్టీ ఎంపీలు రాష్ట్రంలో ఉన్నా.. కొత్తగూడెంకు నవోదయ పాఠశాల ఇవ్వలేదు. బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదు.

కదం తొక్కిన బీఆర్‌ఎస్ శ్రేణులు

కేసీఆర్ బస్సుయాత్ర సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. వరంగల్ జిల్లా మీదుగా బస్సు యాత్ర సాయంత్రం 6గంటల తర్వాత తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం వద్ద జిల్లాలోకి ప్రవేశించగా.. అక్కడి నుంచి కాల్వొడ్డు వరకు పలుచోట్ల బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మయూరిసెంటర్‌లో జిల్లా నేతలు, మహిళలు హారతులు పట్టారు. గులాబీ పూలవర్షం కురిపించారు. ఖమ్మంలోని వైరా రోడ్ జై కేసీఆర్ నినాదాలతో మారుమోగింది. బస్సులో నుంచే కేసీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ జెడ్పీ సెంటర్‌కు చేరుకున్నారు. రాత్రి 8.30 గంటల నుంచి రాత్రి 8.53 వరకు ఆయన ప్రసంగం కొనసాగింది. మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ యాత్రలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు మదన్‌లాల్, బానోతు హరిప్రియ, కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, శీలంశెట్టి వీరభద్రం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన అభ్యర్థి నామ, మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ రవిచంద్ర తదితరులు

నేడు కొత్తగూడెంకు యాత్ర

కేసీఆర్ సోమవారం రాత్రి ఖమ్మంలో బస చేశారు. మంగళవారం వైరా, తల్లాడ, ఏన్కూరు, జూలూరుపాడు మీదుగా కొత్తగూడెంకు బస్సుయాత్ర చేరుకుంటుంది. కొత్తగూడెంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించి అక్కడే రాత్రి బస చేయనున్నారు.

జిల్లా బాగుపడాలని నామ ఆరాటం..

నామ నాగేశ్వరరావుకు రాష్ట్రం బాగుపడాలని, జిల్లా బాగుపడాలనే ఆరాటం ఉంటుంది. గోదావరి నీళ్లను ఖమ్మం జిల్లాకు తెచ్చే ఆలోచన 75 ఏళ్లలో ఎవరూ చేయలే. కృష్ణాలో నీళ్లు తగ్గినప్పుడల్లా.. నలగొండ, ఖమ్మం జిల్లాల్లో పంటలకు ఇబ్బందులు వస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు శాశ్వతంగా ఇబ్బంది తీర్చాలని దుమ్ముగూడెం ప్రాంతంలో 37 టీఎంసీలతో సీతారామ ప్రాజెక్టును తీసుకున్నాం. ఇది పూర్తయితే ఖమ్మం జిల్లాలో ఇంచు భూమి కూడా ఖాళీ ఉండేది కాదు. ఇచ్చంపల్లి దగ్గర గోదావరిపై ప్రాజెక్టు కట్టి కర్ణాటక, తమిళనాడుకు నీళ్లు తీసుకుపోతానని మోదీ అంటున్నడు. రాష్ట్రంతోపాటు ఖమ్మం జిల్లాకు అన్యాయం చేసే మోదీ తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదు. నేను సీఎంగా ఉన్నప్పుడే మోదీ ఈ ప్రతిపాదన తెస్తే రాష్ట్రానికి వచ్చే నీళ్ల లెక్క తేల్చేదాక నా తలతెగినా ఈ ప్రతిపాదనకు ఒప్పుకోనని తెగేసి చెప్పా.. ఇదీ బీఆర్‌ఎస్ పార్టీ పాలసీ. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు, సీట్లు, కేంద్రమంత్రి పదవులు కావాలే తప్ప జిల్లా సమస్యలు, రైతుల ఇబ్బందులు పట్టవు.

సర్వేలన్నీ మనకే అనుకూలం..

బస్సుయాత్ర అనంతరం కేసీఆర్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో బస చేయగా.. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నేతలతో సమీక్షించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సునామీ ఖాయమని, 12 ఎంపీ సీట్లు గెలవబోతున్నామని కేసీఆర్ తెలిపారు. ఖమ్మం సీటు గెలుస్తున్నామని, మిగతా పార్టీల అభ్యర్థుల కంటే నామ ముందంజలో ఉన్నట్లు సర్వే రిపోర్ట్‌లు చెబుతున్నాయని పేర్కొన్నారు. నేతలంతా కష్టపడి పని చేస్తే మంచి మెజార్టీ వస్తుందని దిశానిర్దేశం చేశారు. కొండబాల కోటేశ్వరరావు, ఆర్‌జేసీ కృష్ణ పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ
ఎలక్షన్ 2024

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం



సభలో అభివాదం చేస్తున్న జేపీ నడ్డా, లక్ష్మణ్, సుధాకర్‌రెడ్డి, వినోద్‌రావు, సీతారాంనాయక్ తదితరులు

- మోదీ పాలనలో విప్లవాత్మక మార్పులు
- పార్టీ అభ్యర్థులను ఆదరించండి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

చుంచుపల్లి : పేదలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే బీజేపీతోనే సాధ్యమని పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని అన్నారు. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం, 75 ఏళ్లు నిండిన వారికి ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను అందిస్తున్న ఘనత తమదేనన్నారు. రాబోయే రోజుల్లో ఏడు కోట్ల కుటుంబాలకు పైపులైన్ ద్వారా వంటగ్యాస్ అందించడమే లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్‌లో కుటుంబపాలన సాగుతోందని, దానికి అండగా నిలిచిన పార్టీలకు సైతం అదే చరిత్ర ఉందని ఆరోపించారు. దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే 25 కోట్ల మంది పేదలను ఆర్థికంగా అభివృద్ధిలోకి తెచ్చామని తెలిపారు. ఆదివాసీలు, గిరిజనులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అయోధ్యలో ప్రతిష్టాత్మక రామ మందిరాన్ని నిర్మించిన ఘనత మోదీకే దక్కుతుందని, అది భారత జాతికే గర్వకారణమని అన్నారు. ఎంతో సాహసంతో బీజేపీ ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని నడ్డా ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులుగా తాండ్ర వినోద్‌రావు, అజ్మీరా సీతారాంనాయక్‌ను గెలిపించాలని కోరారు.

దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు..

గత పదేళ్లలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని, దేశ ప్రజలే తన కుటుంబంగా భావించే నరేంద్ర మోదీని మరోసారి గెలిపించాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఎలాంటి అవినీతి లేని నాయకుడిని ఎన్నుకుంటే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. దేశంలో కాంగ్రెస్ వచ్చేది లేదని, రాహుల్ ప్రధాని అయ్యేది లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఓటమి నైరాశ్యంలో మాట్లాడుతున్నారని, అసత్య హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి చిప్ప చేతికిస్తే, ఆ చిప్పను పట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ తోడు దొంగలేనని అన్నారు. కాలం చెల్లిన కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారని విమర్శించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 సీట్లనూ బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశానికి రక్షణ అని, మూడోసారి మోదీకి మద్దతు తెలిపేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మాయమాటలు నమ్మకుండా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థి వినోద్ రావు మాట్లాడుతూ ఢిల్లీలో మాదిరిగానే ఖమ్మం కాంగ్రెస్‌లోనూ కుటుంబపాలన సాగుతోందని, స్థానికేతరుడైన వియ్యంకుడిని మంత్రి పొంగులేటి తెచ్చి పెట్టారని ఆరోపించారు. స్థానికుడినైన తననే ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మహబూబాబాద్ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంతో పాటు రాష్ట్ర సాధనలో అత్యంత కీలకంగా వ్యవహరించానని, తనను గెలిపిస్తే మరోసారి మహబూబాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభలో తమిళనాడు, కర్ణాటక ఎన్నికల సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్, నాయకులు శ్రీకాంత్, నంబూరి రామలింగేశ్వరరావు, జీవీకే మనోహర్, ఎం.శ్రీనివాసరెడ్డి, ఉప్పల శారద, ఆకుల నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, నరేంద్రబాబు పాల్గొన్నారు.

బరి ఖరారు..

- ఖమ్మం స్థానంలో పోటీకి 35 మంది అభ్యర్థులు
- ఉపసంహరించుకున్న ఆరుగురు
- అత్యధికంగా 24 మంది స్వతంత్రులు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం నుంచి పోటీకి మిగిలిన అభ్యర్థుల లెక్క తేలింది. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించగా 45మంది అభ్యర్థులు 72సెట్ల నామినేషన్లు సమర్పించారు. అయితే, 26న స్క్రూటినీలో నలుగురి నామినేషన్లను సరైన పత్రాలు లేని కారణంగా తిరస్కరించారు. ఇక మిగిలిన 41 మందిలో గడువు ముగిసే సోమవారం నాటికి సోమగాని నరేందర్, మారం వెంకటరెడ్డి, తండు ఉపేందర్, పోట్ల నాగేశ్వరరావు, లింగం కృష్ణ, ఒడిత్యా వినోద ఉపసంహరించుకోవడంతో పోటీలో 35 మంది అభ్యర్థులు నిలిచినట్లయింది. ఇందులో నలుగురు గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు కాగా, మిగతా 31 మంది రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులే కావడం విశేషం.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు..

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పోటీలో మిగిలిన అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. ఇందులో గుర్తింపు పొందిన పార్టీలైన బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు కారు, బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేష్‌కు ఏనుగు, కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి హస్తం, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు కమలం గుర్తు కేటాయించినట్లు తెలిపారు. ఇక రిజిస్టర్ పార్టీలైన సోషలిస్టు పార్టీ అన్వర్ రయీస్‌కు కుట్టు మిషన్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి కాశిన ఆనందప్రసాద్‌కు టెలివిజన్, బహుజన్ లెఫ్ట్ పార్టీ అభ్యర్థి ఆంథోని సురేష్‌కు కత్తెర, అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ అభ్యర్థి కుక్కల నాగయ్యకు చపాతీ రోలర్, జైభీంరావు భారత్ పార్టీ అభ్యర్థి కొప్పుల శ్రీనివాసరావుకు కోటు, సకల జనుల పార్టీ అభ్యర్థి పాపెట్ల రామ్మూర్తికి ఓడ, జై భారత్ నేషన్ పార్టీ అభ్యర్థి భట్టు శ్రీనివాస్‌కు టార్చ్ లైట్ గుర్తు కేటాయించారు. మిగిలిన 24 మంది స్వతంత్ర అభ్యర్థులకు కూడా వివిధ గుర్తులు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు.

మానుకోట బరిలో 23 మంది..

మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ సీటు నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య తేలింది. ఈ స్థానంలో మొత్తం 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఐదుగురివి తిరస్కరణకు గురయ్యాయి. ఇక సోమవారం ఇద్దరు స్వతంత్రులు పోరిక సామ్యూల్, పోరిక అశోక్ విత్ డ్రా చేసుకోవడంతో మిగిలిన 23 మంది పోటీలో ఉన్నట్లు జాబితా వెలువరించారు.

కాంగ్రెస్ గెలుపు.. దేశానికి మలుపు

- బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి



ప్రచార సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన పొంగులేటి,కూనంనేని, రఘురాంరెడ్డి

పాల్వంచ : అత్యధిక ఎంపీ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంటేనే దేశంలో కీలక మలుపు వస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం పాల్వంచలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేసి ప్రజల కష్ట సుఖాలు తెసుకున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కొద్ది మంది చేతుల్లోకి నెట్టేసిందని, అంబానీ, అదానీ వంటి వారు సంపదను దోచుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి రాగానే ఒక్కో హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.10లక్షలకు పెంపు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసి ఇప్పుడు బస్సు వేసుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పేరుతో రూ.లక్షల కోట్ల దోపిడీ చేశారని, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్‌ల పేరుతో లూటీ చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. మతాలు, కులాల మధ్య, తండ్రీ కొడుకులు, భార్యాభర్తల మధ్య పంచాయితీ పెట్టిన పార్టీ బీజేపీ అన్నారు. అలాంటి పార్టీ దేశానికి అవసరం లేదని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే ఖమ్మంలో రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గత పాలనలో పాల్వంచ అభివృద్ధిని అణచివేశారని, సర్వే నంబర్ల పేరుతో అభివృద్ధి కుంటు పడిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో తిరిగి పారిశ్రామిక ప్రగతి వస్తోందన్నారు. ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఖమ్మం ఎంపీగా తనను గెలిపిస్తే అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాయకులు కోనేరు సత్యనారాయణ, బరపటి వాసుదేవరావు, మహిపతి రామలింగం, యర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, బాలినేని నాగేశ్వరరావు, చీకటి కార్తీక్, గంగాధర్, నాగరాజు, రాంబాబు, సంతోష్‌గౌడ్, రవికుమార్, మహిపతి రామలింగం పాల్గొన్నారు.

4న సీఎం రేవంత్ రాక !

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మే 4న కొత్తగూడెం రానున్నట్లు తెలిసింది. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రఘురాంరెడ్డికి మద్దతుగా సీఎం ప్రచారం నిర్వహిస్తారని సమాచారం. అయితే ఆయన పర్యటనపై ఇంకా నిర్దిష్టమైన షెడ్యూల్ విడుదల కాలేదు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయండి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



మాట్లాడుతున్న ప్రియాంక ఆల, పక్కన ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. జిల్లాలోని ఏఆర్‌ఓలు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఇతర శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, దివ్యాంగుల కోసం చేసిన ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయో పరిశీలించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. ఓటింగ్ సమయంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు ఎన్‌కోర్ యాప్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి తాగునీరు, భోజనాలు ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ అనంతరం నిర్దేశిత రూట్‌మ్యాప్ ద్వారా మాత్రమే ప్రిసైడింగ్ అధికారి పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ఈవీఎంలను తరలించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాలు నిర్వహించే పాఠశాలల్లో తాగునీరు, ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలు కల్పించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఆర్డీఓలు దామోదర్, మధు, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమయ్యామని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిందని, ఖమ్మం పార్లమెంట్ బరిలో 35 మంది, మహబూబాబాద్ స్థానంలో 23 మంది బరిలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఈనెల 25 వరకు 9,88,238 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 4,79,626, మహిళలు 5,08,550, ఇతరులు 62, ఎన్ఆర్‌ఐలు 54 మంది ఉన్నారని తెలిపారు. మే 4 నుంచి 6వ తేదీ వరకు హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. 85 సంవత్సరాలు పైబడిన వారు 362 మంది, దివ్యాంగ ఓటర్లు 388 మంది, ఏవీఈఎస్(అత్యవసర సర్వీస్) ఓటర్లు 115 మంది ఉన్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత జిల్లాలో 78,890 ఎపిక్ కార్డులు పంపిణీ చేశామని చెప్పారు. ఇంకా 1,889 కార్డులు రావాల్సి ఉందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా ఎన్నికల సరళిని పరిశీలించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 169 సమస్యాత్మక ప్రదేశాల్లో 207 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎన్నికల సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని, మే 4 నుంచి 6 వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

నేటి నుంచి సిబ్బందికి శిక్షణ

కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి మంగళవారం నుంచి మే 3 వరకు ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కాలేజీలో శిక్షణ ఉంటుందని ప్రియాంక ఆల తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణకు సిబ్బంది విధిగా హాజరు కావాలని సూచించారు. భద్రాచలం, పినపాక, ఇల్లెందు పీఓ, ఏపీఓలకు కూడా శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గ సిబ్బందికి సుదిమళ్ల టీటీడబ్ల్యూజేఆర్ కళాశాలలో ఈనెల 30, మే1న, పినపాక సిబ్బందికి మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 1, 2 తేదీల్లో, భద్రాచలం నియోజకవర్గ సిబ్బందికి ఈనెల 30, మే 1న భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని వివరించారు.

పనితీరు మెరుగుపర్చుకోండి

- వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్



డయాలసిస్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

ఇల్లెందు : ఆస్పత్రిలో ఉద్యోగులంతా పనితీరు మెరుగుపర్చుకోవాలని, సిబ్బందికి అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. ఇల్లెందు 100 పడకల వైద్యశాల రోల్‌మోడల్‌గా ఉందన్నారు. సోమవారం ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. పేషెంట్లతో మాట్లాడి చికిత్స, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ సెంటర్‌లో బాధితుల వివరాలు నమోదు చేసుకున్నారు. బాలింతలకు ఆహారం సక్రమంగా అందుతోందా లేదా అని ఆరా తీశారు. ఆశించిన స్థాయిలో ఆహారం పెట్టడం లేదని బాలింతలు ఫిర్యాదు చేయగా, గదుల్లో మెనూ ప్రదర్శించాలని, దాని ప్రకారం ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు ఉన్నా లిఖితపూర్వకంగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ఆస్పత్రి రోల్‌మోడల్‌గా ఉందని, సదుపాయాలు, ఉద్యోగులు, డాక్టర్ల పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 70కి పైగా ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్‌లోకి మారినా ఇల్లెందు వైద్యశాలలా ఏ ఆస్పత్రీ లేదన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఓటు ఐదు రకాలు



ఓటు హక్కు ఉన్న ప్రతి వ్యక్తి ఓటును నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి వేస్తారు. ఓటును ఐదు రకాలుగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది.

– భద్రాచలంఅర్బన్

■ సాధారణ ఓటు : 18 సంవత్సరాలు నిండి, ఓటు హక్కు కలిగిన ప్రతి వ్యక్తి వేసే ఓటు.

■ పోస్టల్ బ్యాలెట్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ స్వస్థలాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు. వీరికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించారు.

■ సర్వీస్ ఓటు: దేశ రక్షణలో ఉన్న సైనికులు, పారా మిలటరీ ఉద్యోగులు ఉద్యోగ రీత్యా దూరప్రాంతాల్లో ఉంటారు. వీరు తమ స్వగ్రామాల్లో వేసేందుకు సర్వీస్ ఓట్లను వినియోగించుకోవచ్చు.

■ ప్రాక్సీ ఓటు: తమకు బదులుగా ఇతరులను పంపించి ఓటు వేసే అవకాశం. ఇంటెలిజెన్స్, గూఢచారి విధులు నిర్వహించే వారు ఎవరికీ తెలియకుండా ఉంటారు. వారు తమ ఓటు ఈ విధానంలో వేసే అవకాశం ఉంది.

■ టెండర్ ఓటు: జాబితాలో పేరుండి పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లేసరికి.. అప్పటికే అతని ఓటు వేరొకరు వేసి ఉంటే.. సదరు ఓటరుకు టెండర్ ఓటు అవకాశం కల్పిస్తారు. అయితే తన ఓటును తాను వేయలేదని, గుర్తు తెలియని వ్యక్తి ఎవరో వేశారని నిరూపించుకోగలగాలి.

ఇక్కడ మరింత భద్రత



ఓటర్లకు భరోసా కల్పించేలా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు (ఫైల్)

నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక కేంద్రాలు

నియోజకవర్గం	సమస్యాత్మక ప్రాంతాలు	పోలింగ్ బూత్‌లు	సూక్ష్మ పరిశీలకులు
ఖమ్మం	8	27	15
పాలేరు	20	51	31
మధిర	18	47	28
వైరా	24	40	28
సత్తుపల్లి	16	44	27
కొత్తగూడెం	14	18	15
అశ్వారావుపేట	03	03	03
మొత్తం	103	230	147

- లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ఆయా ప్రాంతాల్లో సూక్ష్మపరిశీలకుల నియామకం
- పోలింగ్ కేంద్రాల లోపల, బయట సీసీ కెమెరాల ఏర్పాటు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరగనుండగా ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఖమ్మం లోక్‌సభ పరిధిలో 1,896 పోలింగ్ బూత్‌లను 1,083 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇందులో 103 ప్రాంతాల్లోని 230 పోలింగ్ బూత్‌ల వద్ద సమస్యాత్మక పరిస్థితులు ఉన్నాయని తేల్చారు. ఆయా ప్రాంతాల్లో పరిశీలనలకు 147మంది మైక్రో అబ్జర్వర్ల(సూక్ష్మ పరిశీలకులు)ను నియమించారు. ఇక అన్ని పోలింగ్ కేంద్రాల లోపలి భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనుండగా.. సమస్యాత్మక ప్రాంతాల్లోని బూత్‌ల్లో మాత్రం ఆవరణలో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

కట్టు దాటితే కష్టమే

- ఎన్నికల వ్యయంపై డేగకళ్లతో నిఘా
- నిశితంగా పరిశీలిస్తున్న ప్రత్యేక బృందాలు



భద్రాచలంఅర్బన్: ఎన్నికలంటేనే ఖర్చుతో కూడుకున్నది. అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకొని విజయం సాధించేందుకు అభ్యర్థులు శ్రమిస్తుంటారు. ఈ క్రమంలో అభ్యర్థుల వ్యయ పరిమితికి సంబంధించి ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది. ప్రచారంలో ఉపయోగించే ప్రతీ అంశాన్ని లెక్క ఖరారు చేసిన సంఘం.. అటు అభ్యర్థులను ఖర్చుల వివరాలు నమోదు చేయాలని సూచించడమే కాక నిఘా బృందాల ద్వారా తనిఖీ చేయిస్తోంది.

రూ.95 లక్షల పరిమితి..

లోక్‌సభ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ. 95 లక్షలుగా ఎన్నికల సంఘం నిర్దేశించింది. ఇంత కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లు తేలినా.. నిర్ణీత మొత్తమే ఖర్చు చేసి లెక్కలు సమర్పించకున్నా చర్యలు తీసుకునే అవకాశముంటుంది. కాగా, నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి అభ్యర్థుల ఖర్చు లెక్కిస్తారు. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు చేపట్టిన ప్రచారాలు, సభలు, ఇతర కార్యక్రమాల ఖర్చులను పార్టీ ఖర్చు కింద జమచేస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో కొత్త ఖాతా తెరిచి లావాదేవీలన్నీ ఆ ఖాతా ద్వారా నిర్వహించాలి. ఇక అభ్యర్థుల ప్రచారాన్ని షాడో బృందాలు నిశితంగా పరిశీలించడమే కాక వీడియో చిత్రీకరణ సైతం చేస్తాయి. తద్వారా అభ్యర్థులు తప్పుడు లెక్కలు సమర్పించినా.. ఈ బృందాల ఇచ్చే వివరాల ఆధారంగా ఖర్చు లెక్కలు వేస్తారు. ఇక జిల్లాకు చేరిన వ్యయ పరిశీలకులు సైతం విస్తృతంగా పర్యటిస్తూ అభ్యర్థుల వ్యయ పరిశీలన, వివరాల నమోదుపై యంత్రానికి దిశానిర్దేశం చేస్తున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే టెస్ట్‌లు

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కళాశాలల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధిస్తున్న లెక్చరర్లలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే టెస్ట్, డెమో పరిశీలించినట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. భద్రాచలం, కిన్నెరసాని, దమ్మపేట, ఖమ్మం సీఓఈ కళాశాలల అధ్యాపకులకు సోమవారం టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌ల గిరిజన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, ఎంసెట్, నీట్‌లో ఉత్తమ ర్యాంక్‌లు సాధించేలా శిక్షణ ఇచ్చేందుకు స్పెషల్ ఫ్యాకల్టీలను ఎంపిక చేసేందుకే ఈ టెస్ట్ నిర్వహించామని తెలిపారు. లెక్చరర్ల బోధన సక్రమంగా ఉంటేనే విద్యార్థులు అభివృద్ధి చెందుతారని అన్నారు.



లెక్చరర్ల డెమోను పరిశీలిస్తున్న పీఓ, అధికారులు

విద్యార్థులకు ఇబ్బంది రానీయొద్దు

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. ఈ మేరకు స్పెషలాఫీసర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఏమైనా మరమ్మతు పనులు ఉంటే ప్రారంభానికి వారం రోజుల ముందుగానే పూర్తి చేయాలని చెప్పారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో వారి ఊర్లకు వెళ్లి అక్కడి వాతావరణానికి అలవాటు పడిపోయి తిరిగి పాఠశాలలు తెరవగానే వచ్చేసరికి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాలని, విద్యార్థులకు ఇంటిని మరిపించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అందరికీ మంచాలు సమకూర్చి డార్మెటరీ, తరగతి గదులకు ఆల్ఫాబెట్ల ప్రకారం నంబర్లు వేయించాలని, విద్యార్థులు పడుకునే గదుల్లో నాలుగు బెడ్లకు కలిపి ఒక ఫ్యాన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, గురుకులం ఏఓ నరేందర్, ఈఈ తానాజీ, ఎస్‌ఓ సురేష్ బాబు, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నరసింహారావు, డీటీఆర్‌ఓ శ్రీనివాస్, ఏడీ భాస్కరన్, అశోక్‌కుమార్, పవర్ మునీర్ పాషా, అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

ఓటమి ప్రేరణతో అవధుల్లేని గెలుపు

- ప్రణాళికలతో గుణాత్మక విజయాలు
- పాస్, ఫెయిల్‌పై విద్యార్థుల్లో ఆందోళన
- నేడు పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

కొత్తగూడెంఅర్బన్: స్పష్టమైన ప్రణాళికలతో గుణాత్మక విజయాలు సాధించవచ్చు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్‌కు అడుగులు వేయాల్సిన అవసరముంది. మంగళవారం పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసిన విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. పగలు, రాత్రి ఎలా ఉంటాయో గెలుపు ఓటములు కూడా అంతే అని నిపుణులు చెబుతున్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అందరూ పాస్ కావాలనే ఏడాదిపాటు కష్టపడి చదువుతారు. కానీ అనేక కారణాలతో కొందరు ఫెయిలయ్యే అవకాశం ఉంటుంది. ఫెయిలైన వారు నిరాశకు గురై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పలువురు మానసిక వైద్యులు సూచిస్తున్నారు. ఓటమి విజయానికి నాందిగా మలుచుకోవాలని, క్షణికావేశాలతో, అనాలోచిత నిర్ణయాలు తీసుకోవొద్దని పేర్కొంటున్నారు. ఓటమి ప్రేరణతో పొందిన విజయాలకు అవధులే ఉండవని చెబుతున్నారు. మనం బాధపడి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను బాధ పెట్టొద్దని, ఓటమి కామా వంటిదే కానీ ఫులిస్టాప్ కాదని పేర్కొంటున్నారు. ఓటమికి కారణాలను అన్వేషించి మేధస్సుకు మరింత పదును పడితే కచ్చితంగా విజయం సొంతమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కాగా జిల్లాలో 12,341 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. నేడు రానున్న ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఏ స్థానం దక్కుతుందో వేచి చూడాలి.

క్లుప్తంగా

పోలీస్ బలగాల ఫ్లాగ్ మార్చ్



విద్యానగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

చుంచుపల్లి: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా భరోసా కల్పించేందుకు సోమవార ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. చుంచుపల్లిలోని విద్యానగర్ బైపాస్ నుంచి పోస్టాఫీస్‌సెంటర్ వరకు మార్చ్ నిర్వహించగా, సెంట్రల్ పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా పార్లమెంటు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన వ్యక్తికి ఓటువేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు రాయల వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి, ఎస్‌ఐ జుబేదాబేగం, రవి, జీవన్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ముమ్మరంగా తనిఖీలు

చర్ల రూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చర్ల, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సోమవారం బాంబ్ స్క్వాడ్ సిబ్బంది చర్ల నుంచి లెనిన్ కాలనీ మీదుగా ఛత్తీస్‌గఢ్ వెళ్లే రహదారికి ఇరువైపులా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికల వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిఘా చర్యలు చేపట్టారు. పోలీసు స్టేషన్ ముందు భద్రతా సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

రూ.లక్ష నగదు సీజ్

ఇల్లెందురూరల్: మండలంలోని లలితాపురం చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ.లక్ష నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. ఇందిరానగర్‌కు చెందిన నాగరాజు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కుమారస్వామి తెలిపారు.

మద్యం స్వాధీనం



మద్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎఫ్‌ఎస్‌టీ–5 బృందం సోమవారం కోయగూడెం గ్రామంలో తనిఖీలు చేపట్టింది. రెండు కిరాణ దుకాణాల నుంచి 23.88 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు బృందం ఇన్‌చార్జి వాసవీ రాణి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

బీజేపీ జాతీయ అధ్యక్షుడి వాహనం తనిఖీ





జేపీ నడ్డా ప్రయాణించిన హెలికాప్టర్, కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

కొత్తగూడెంటౌన్: ఎన్నికల ప్రచారానికి సోమవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కొత్తగూడెం వచ్చారు. హెలికాప్టర్‌లో కొత్తగూడెం ప్రగతిమైదానంలో దిగి, అక్కడి నుంచి పోస్టాఫీస్‌సెంటర్‌లోని సింగరేణి ప్రకాశం స్టేడియానికి కాన్వాయ్‌లో సభా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నడ్డా ప్రయాణించిన హెలికాప్టర్, కాన్వాయ్‌లోని కార్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పి.రాకేష్ ఆధ్వర్యంలోని తనిఖీలు నిర్వహించారు. కాగా ఎస్పీ రోహిత్‌రాజు అధ్వర్యంలో సభా ప్రాంగణం వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు.

టేకు కలప స్వాధీనం



అటవీశాఖ అధికారులు పట్టుకున్న కలప

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం–హనుమంతులపాడు ప్రధాన రహదారి సమీప అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న కలప విలువ రూ. లక్షలు ఉంటుందని, కలప యార్డుకు తరలించామని ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న తెలిపారు. కలపను అక్రమంగా నిల్వ చేస్తున్నవారికోసం గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

టేకులపల్లి: మండలంలోని బోడు పోలీస్ స్టేషన్ పరిధి ఓ మారుమూల గ్రామంలో గత ఆగస్టులో వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్ కథనం ప్రకారం.. బోడు పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన చీమల రామయ్య గత ఆగస్టులో ఇంట్లో ఒంటరిగా ఉన్న 80 ఏళ్ల వృద్ధురాలిపై అమానుషంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అప్పుడు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ నెల 23న రాత్రి అదే గ్రామానికి చెందిన వితంతువుపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయగా, చుట్టుపక్కల వారు వచ్చి దేహశుద్ధి చేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు నేరాలకు పాల్పడింది అతనేనని తేలింది. దీంతో అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



రైతుకు భూసార పరీక్ష పత్రాన్ని అందిస్తున్న డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేటరూరల్: గ్రామాభివృద్ధికి విద్యార్థులు, యువత కృషి చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ సూచించారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. రైతులకు భూసార పరీక్ష పత్రాలను, విద్యార్థులకు ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ సేవక పత్రాలను పంపిణీ చేశారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులంతా కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రెడ్డి ప్రియ, డాక్టర్ ఆర్.రమేష్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఐ.కృష్ణతేజ, ఎస్ జగదీశ్వర్, షేక్ అస్లాం పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



గోపాలరావు (ఫైల్)

దుమ్ముగూడెం : మండలంలోని పెద్దార్లగూడెం గ్రామానికి చెందిన మర్మం గోపాలరావు(40) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన గోపాలరావు రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు చెరువు దగ్గరకు వెళ్లి గాలింపు చేపట్టారు. రాత్రి కావడంతో ఆచూకీ లభించకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం మళ్లీ చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతున్న వ్యక్తి...



శ్రీనివాసరావు (ఫైల్)

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతి చెందాడు. మండలంలోని గున్నేపల్లి గ్రామ సమీపంలో ఈనెల 26న బైక్ కిందపడి మొద్దులగూడెం గ్రామానికి చెందిన దొడ్డా శ్రీనివాసరావు (50), చీమల శ్రీను తీవ్రంగా గాయపడ్డ విషయం విదితమే. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వారిలో దొడ్డా శ్రీనివాసరావు పరిస్థితి విషమించి మృతి చెందాడు.

ద్విచక్రవాహనం ఢీకొని..

భారజల ఉద్యోగి మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగి సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న సలిగంజి వెంకటేశ్వరరావు(54) భారజల కర్మాగారం క్యాంటిన్ అటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని కాలినడకన ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో భారజల కర్మాగారానికి చెందిన మరో ఉద్యోగి స్కూటీపై వస్తున్నాడు. ఈక్రమంలో కాలనీ సమీపంలో వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టడంతో వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబసభ్యులు గౌతమీనగర్ కాలనీలో భారజల ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. మృతదేహానికి మణుగూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భారజల ఉద్యోగి మృతిపై జీఎం జగ్గారావు, అధికారులు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, పాద్య కేశవరావు, గద్దం రమేష్, పోతురాజు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, విఠల్‌రావు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇల్లెందురూరల్‌లో మరొకరు..

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ కూడలి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సుదిమళ్ల గ్రామపంచాయతీ పాతనర్సాపురం గ్రామానికి చెందిన ఈసం కృష్ణ (65) కూరగాయలు కొనేందుకు సుభాష్‌నగర్ కూడలి వద్దకు వస్తుండగా డీసీఎం వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శునకాల దాడిలో దుప్పి మృతి



మృతి చెందిన దుప్పి వద్ద అటవీ అధికారులు, గ్రామస్తులు

కరకగూడెం: శునకాల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన పినపాక మండలంలో సోమవారం జరిగింది. తోగ్గూడెం గ్రామానికి సమీపంలో పొట్లపల్లి గుట్ట నుంచి కుక్కలు దుప్పిని తరుముకుంటూ వచ్చాయి. దాడి చేసి హతమార్చాయి. స్థానికులు సమాచారంతో వచ్చిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మణరావు, సిబ్బంది దుప్పి కళేబరాన్ని స్వాధీన పరుచుకున్నారు. పంచనామా అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

● జలపుష్పాల వేట



చెరువులో చేపలు పడుతున్న గ్రామస్తులు

మండల పరిధిలోని పద్మాపురం గ్రామస్తులు సోమవారం స్థానిక బుగ్గ చెరువులో మండుటెండను సైతం లెక్కచేయకుండా చేపల వేట సాగించారు. తమ వెంట తెచ్చుకున్న వలలు, గాలాల సాయంతో జల పుష్పాలను పట్టుకుని వెళ్లారు.

– కరకగూడెం